# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 312
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
సెప్టెంబర్ 24, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## నేరాలను నియంత్రించాలి



8లో..

- పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- వరంగల్ ఏసీపీ కార్యాలయం తనిఖీ



# కోట్ల నిధులతో.. కొత్తకల

- వర్ధన్నపేట అభివృద్ధే శ్వాస, ధ్యాస
- నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా నిలుపడమే లక్ష్యం
- హామీల అమలుకు ఎమ్మెల్యే నాగరాజు అలుపెరగని పోరాటం
- సీఎం, ఇంచార్జి మంత్రి సహకారంతో ప్రగతి పరుగులు
- ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు
- నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం

ఆయన ప్రజల మనిషి.. వర్ధన్నపేట అభివృద్ధే శ్వాస, ధ్యాసగా ముందుకు సాగుతున్నారు.. తెల్లారింది మొదలు పొద్దుపోయే వరకు ప్రజల మధ్యే ఉంటూ వారి తలలో నాలుకలా వ్యవహరిస్తున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తూ నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా నిలిపేందుకు కృషి చేస్తున్నారు. ఆయనే వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు. ధృఢ సంకల్పం, పట్టుదల ఉంటే తనను నమ్ముకున్న ప్రజల కళ్లలో ఆనందం చూడవచ్చన్న నమ్మకంతో తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. కోట్ల నిధులతో వర్ధన్నపేటకు కొత్తకల తెచ్చేందుకు పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తున్నారు. ప్రజల చెంతకే సంక్షేమ పథకాలను తీసుకుపోతూ అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ప్రజా సేవలో తరిస్తున్నారు.

- వరంగల్ వాయిస్, వర్ధన్నపేట




వివరాలు2లో..



8లో..

## గాయత్రీ మాతగా భద్రకాళి

మూడో రోజుకు చేరిన శరన్నవరాత్రోత్సవాలు | భారీగా తరలి వస్తున్న భక్తులు



ఆడి, పాడిన మంత్రి సురేఖ

## బల్దియాలో బతుకమ్మ వేడుకలు

వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించార. ఈ వేడుకల్లో జిల్లా మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. బతుకమ్మ ఆట పాటలతో బల్దియా ప్రాంగణం మారుమ్రోగింది. తీరొక్క పూలతో అందంగా అలంకరించి బతుకమ్మల చుట్టూ మహిళలు పాటలు పాడుతూ కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. – వరంగల్ వాయిస్, వరంగల్




# కోట్ల నిధులతో.. కొత్తకల



- వర్ధన్నపేట అభివృద్ధే శ్వాస, ధ్యాస
- నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా నిలుపడమే లక్ష్యం
- హామీల అమలుకు ఎమ్మెల్యే నాగరాజు అలుపెరగని పోరాటం
- సీఎం, ఇంచార్జి మంత్రి సహకారంతో ప్రగతి పరుగులు
- ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు
- నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఈ పథకాల ద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకీ తీసుకుపోవడంలో స్థానిక ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ముందువరుసలో ఉన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఎజెండాగా ఆయన ముందుకు సాగుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 3,500 మంది లబ్ధిదారులకు రూ. 14.50 కోట్ల నిధులను పంపిణీ చేశారు. సీఎంఆర్ ఎల్ఓసీ ఫండ్ కింద 2,220 మందికి రూ.14.70 కోట్ల విలువ చేసే చెక్కులను అందజేశారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 51,620 కుటుంబాలకు రూ. 6.92 కోట్ల లబ్ధి చేకూరింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహాలక్ష్మి పథకం కింద 15.62 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయగా, 1,70,762 మంది లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం ద్వారా రూ. 3.64 కోట్ల లబ్ధి లభించింది.

## రైతుల సంక్షేమమే లక్ష్యం..

రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటదని నమ్మిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వర్ధన్నపేట నియోజకవర్గంలో 18,538 మంది రైతులకు రూ. 145.61 కోట్ల రుణమాఫీ చేసింది. రైతు భరోసా కింద 1,80,737 మంది రైతులకు రూ. 170.67 కోట్ల నిధులు పంపిణీ చేశారు. రైతు బీమా పేరుతో మరణించిన 138 మంది రైతు కుటుంబాలకు రూ. 6.90 కోట్లు అందజేశారు. 10,303 మంది రైతులకు రూ. 84.39 కోట్ల పంట రుణాలు లభించాయి. చేయూత పథకం ద్వారా 23,706 మందికి రూ. 9.28 కోట్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద ఇప్పటి వరకు 2,277 మంది లబ్ధిదారులకు రూ. 22.79 కోట్లు అందజేశారు.

## భారీగా నిధులు..

వర్ధన్నపేట నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం రూ. 200 కోట్లు, అలాగే 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం రూ. 26 కోట్లు మంజూరు అయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 437 పనులకు రూ. 53.71 కోట్లు, రోడ్లు భవనాల శాఖ ద్వారా రూ. 8.20 కోట్ల నిధులు కేటాయించి పనులు చేపడుతున్నారు. నీటిపారుదల శాఖ కింద 30 పనులకు రూ. 18.56 కోట్లు మంజూరయ్యాయి. స్మార్ట్ సిటీ పథకం కింద జీడబ్ల్యూఎంసీలోని 13 డివిజన్లలో రూ. 42 కోట్లతో, అలాగే సాధారణ నిధుల కింద 515 పనులకు రూ. 84 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. విద్యాశాఖ ద్వారా 235 పనులకు రూ. 22.36 కోట్లు, వర్ధన్నపేట మున్సిపాలిటీలో అమృత్ పథకం కింద రూ. 34 కోట్లు మంజూరు చేశారు.

## మహిళా సాధికారతకు పెద్దపీట..

బ్యాంక్ లింకేజీ ద్వారా 1,040 మహిళా సంఘాలకు రూ. 140.87 కోట్లు, శ్రీనిధి ద్వారా రూ. 6.28 కోట్లు, వడ్డీ లేని రుణాల కింద రూ. 3.87 కోట్లు అందజేశారు. మెప్మా ద్వారా 542 మహిళా సంఘాలకు రూ. 8.38 కోట్లు పంపిణీ చేశారు. 701 మంది గౌడ సోదరులకు రూ. 70.10 లక్షల విలువైన కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 9,612 కొత్త రేషన్ కార్డులను, 2,660.12 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన జీవనం, ఆర్థిక భద్రత లభిస్తోందని కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు నియోజకవర్గం పురోగతికి దోహదపడుతున్నాయనే బలమైన సంకల్పంతో ఆయన నిరంతరం పనిచేస్తున్నారు.

## సీఎం, ఇంచార్జి మంత్రి సహకారంతోనే..


అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహాయ సహకారాలతోనే నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ప్రకటించారు. పదవులకన్నా ప్రజా సంబంధాలే విన్న అనే భావంతో ముందుకెళ్తున్నట్లు వెల్లడించారు. మనం చేసిన మంచి పనులతో ఎంత మంది గుండెల్లో నిలిచిపోయామనే భావనతోనే అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తన ధ్యేయం అన్నారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు, రైతు బరోసా, రైతు రుణమాఫి, ఇందిరమ్మ ఇళ్లు, దేవాలయాల అభివృద్ధి తదితర అనేక పథకాలు, కార్యక్రమాలను నియోజకవర్గంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాగరాజు వెల్లడించారు.









# గారడీ మాటలతో మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వం

● రాచర్ల బాలరాజు విమర్శ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జీఎస్టీ పన్నుల విధానం పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపయోగపడదని, ఇది మోడీ ప్రభుత్వ మోసపూరిత విధానమని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు తీవ్రంగా విమర్శించారు. బుధవారం వరంగల్ నక్కలపల్లిలో జరిగిన శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాట యోధురాలు పైలా చంద్రక్క, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. ముక్తార్ పాషా ఐదవ సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వారిని స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ జీఎస్టీ పన్నుల విధానంపై మోడీ ప్రభుత్వం సంకలు కొట్టుకుంటోందని ఎద్దేవా చేశారు. గత ఏడేళ్ల క్రితం తీసుకొచ్చిన ఈ విధానం వల్ల దేశంలోని పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులే లాభపడ్డారని, వారి కోసం దేశ ప్రజల లక్షల కోట్ల రూపాయల సొమ్మును పన్నుల రూపంలో ధారపోశారని ఆరోపించారు. సామాన్య ప్రజలు కొనుగోలు చేసే నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికీ తగ్గలేదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ పన్నుల విధానం వల్ల రాష్ట్రాలు తమ పన్ను వసూలు అధికారాలను కోల్పోయి బిచ్చగాళ్లుగా మారాయని బాలరాజు వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వం ఏకకేంద్ర విధానాలను అమలు చేస్తూ, రాజ్యాంగం కల్పించిన సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని అన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటమే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, నరసింగం సాంబయ్య, అయిత యాకయ్య, ప్రభాకర్, రాజు, నారాయణ, ఎల్లయ్య, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** మైనారిటీల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని హుజూరాబాద్ నియోజకవర్గ మైనారిటీ సోదరులు అన్నారు. నియోజకవర్గంలోని మసీదులు, కమ్యూనిటీ హాళ్లు, కబరిస్తాన్లు, షాదిఖానాలకు నిధులు మంజూరు కావడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులకు ఇప్పుడు మోక్షం లభిస్తుందని వారు తెలిపారు. ఈ కృషికి సహకరించినందుకు ప్రణవ్ బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని బోర్నపల్లిలో ఉన్న షాదిఖానా, కమ్యూనిటీ హాల్‌కు రూ. 10 లక్షలు, హుజూరాబాద్ మండలంలోని కందుగుల కమ్యూనిటీ హాల్‌కు రూ. 10 లక్షలు, పెద్ద పాపయ్యపల్లి కబరిస్తాన్ ప్రహరీ గోడకు రూ. 5 లక్షలు, వీణవంక మండలం చల్లూరు గ్రామంలోని హసీర్ ఖానాకు రూ. 4 లక్షలు మంజూరు అయ్యాయి. మొత్తం రూ. 29 లక్షల విలువ చేసే ఈ నిధులను ఎస్‌డీఎఫ్ ఫండ్ ద్వారా ప్రణవ్ బాబు మంజూరు చేయించారని వారు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ప్రణవ్ బాబుకు, జిల్లా మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో చూపుతున్నారని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దసరా మన సంస్కృతికి ప్రతీక

## వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, ఏనుమాముల :** దసరా పండుగ మన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక అని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. అన్ని పార్టీల మద్దతుతో బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్‌లోని చిన్న వడ్డేపల్లి చెరువు సమీపంలో దసరా ఉత్సవాల పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు లక్ష్మీ గణపతి కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలను సందర్శించి, అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజలంతా కలిసికట్టుగా పండుగను ఆనందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని సూచించారు. విద్యుత్, నీరు, పారిశుధ్యం, ఆరోగ్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పరస్పర సహకారంతో పనిచేస్తే ఈ వేడుకలు చిరస్మరణీయంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్‌లోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# యువతలో జాతీయ భావాల పెంపు ఎన్ఎస్ఎస్ లక్ష్యం

● కోడిమాల శ్రీనివాసరావు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** యువతలో సమాజ సేవ, జాతీయ భావాలను పెంపొందించడమే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ముఖ్య లక్ష్యమని ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన 56వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ విషయాలు తెలిపారు. మహాత్మా గాంధీజీ ఆశయాలైన సామాజిక నిర్మాణం, గ్రామీణ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. ఈ ఆశయాలను నిజం చేయాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం సుమారు 20 సంవత్సరాలు శ్రమించి, 1969, సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ ను ప్రారంభించిందని తెలిపారు. “నా కోసం కాదు, మీ కోసం” అనే నినాదంతో ప్రారంభమైన ఈ పథకం, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి వి.కె.ఆర్.వి. రావు చేతుల మీదుగా గాంధీజీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రారంభమైంది. అప్పట్లో 37 విశ్వవిద్యాలయాలలో 40 వేల మంది వలంటీర్లతో మొదలైన ఎన్ఎస్ఎస్, ప్రస్తుతం 42 లక్షల మంది వలంటీర్లతో విస్తరించిందని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కేవలం చదువు మాత్రమే కాకుండా, విద్యార్థులను సమాజ సేవలో భాగస్వామ్యం చేసి వారి వ్యక్తిత్వ వికాసానికి కృషి చేస్తుందని శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు చెడు మార్గాల వైపు వెళ్లకుండా అడ్డుకట్ట వేయడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. శ్రమ విలువ, నాయకత్వ లక్షణాలు, సమాజ రుగ్మతలపై స్పందించే గుణం, దేశభక్తి వంటి అద్భుతమైన లక్షణాలను ఈ పథకం అలవరుస్తుందని వివరించారు. ప్రస్తుతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మాదకద్రవ్యాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, రక్తదానం, పర్యావరణ పరిరక్షణ, హెచ్ఐవీ–ఎయిడ్స్, ప్లాస్టిక్ నిషేధం, ఓటర్ల చైతన్యం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నారని అన్నారు. ఈ వలంటీర్లు సమాజ శ్రేయస్సు కోసం యూనిఫాం లేని సైనికుల్లా పనిచేస్తూ, ఒక మంచి పౌరుడిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు దేవిశ్రీ ప్రసాద్, సాత్విక్, సాకేత్, రాజ్‌కుమార్, చిరంజీవి, సాయి హర్షిత్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రఘంటా రూపంలో పద్మాక్షి దేవి దర్శనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రసిద్ధ శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల మూడవ రోజు బుధవారం అమ్మవారు చంద్రఘంటా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4:30 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు షోడశ కలశాలతో, మహానారాయణోపనిషత్తు మంత్రాలతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రఘంటా రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని పూజించడం వల్ల దుఃఖం, మానసిక క్లేశాలు వంటి ఇతిబాధలు తొలగిపోతాయని ఆలయ వేద పండితుడు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని వివరించారు. బుధవారం ప్రత్యేక పూజలకు కీర్తి ఉమెన్, చిల్డ్రన్స్ హాస్పిటల్ అధిపతి ముక్కా దిలీప్–అర్చన దంపతులు, మాధవరావు–మాధవి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. సాయంత్రం 6 గంటల నుంచి పంచాహ్నిక సాంస్కృతిక కార్యక్రమాలు రెండో రోజు కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా పెండ్యాల జయశ్రీ, మాదిపెద్ది పరంజ్యోతి, కాళేశ్వరం అనూష, దేవులపల్లి శ్రీ విద్య వారి శిష్య బృందాలు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కళాకారులను, వారి గురువులను శాలువాలతో సత్కరించి, ప్రసాదం పంపిణీ చేశారు.

# ఘనంగా దుర్గామాత ఉత్సవం



**వరంగల్ వాయిస్, గణపురం :** వరంగల్ జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే జి.ఎస్. ఆర్. పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గాదేవి ఉత్సవాల చివరి రోజున ప్రజలందరూ కలిసి పూజల్లో పాల్గొని, అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో కొత్తకొండ భద్రకాళి అమ్మవారు



**వరంగల్ వాయిస్, కొత్తకొండ :** కొత్తకొండలోని ప్రసిద్ధ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూడవ రోజు అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా కలశ స్థాపన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, లలితా సహస్ర నామ పారాయణం వంటివి నిర్వహించారు. వేదాలకు మూలమైన శ్రీ గాయత్రీ దేవికి గాయత్రీ అష్టోత్తర శతనామావళి మరియు చతుర్వేద పారాయణాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి. కిషన్ రావు, ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు రాంబాబు, శ్రీకాంత్, ఇతర అర్చకులు సందీప్, శ్రావణ్, శరత్ చంద్ర, శివకుమార్ తో పాటు భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరకాలలో అన్నప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో స్వర్ణకార సంఘం నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. మాజీ కౌన్సిలర్, బీజేపీ నాయకులు బెజ్జంకి పూర్ణచారి, ఆయన సతీమణి వాణిశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్ణచారి దంపతులు ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పెసరు విజయచందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి. జయంత్ లాల్, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, గురిజాల శ్రీరామ్ రెడ్డి, కొలనుపాక భద్రయ్య, మార్త భిక్షపతి, గోగుల రాజిరెడ్డి, మేకల రాజవీరు, పాలకుర్తి తిరుపతి, ఆకుల రాంబాబు, కట్టగాని శ్రీకాంత్, పుట్ట రవీందర్, ఎద్దులాపురం శ్రవణ్ కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**వరంగల్ వాయిస్, దామెర:** ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) వరంగల్ జిల్లా పరకాలలో నిర్వహించనున్న సమావేశానికి దామెర మండల కేంద్రం నుంచి నాయకులు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ దామర గ్రామ అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొడకండ్ల శ్రీనివాస్, వికలాంగుల మండల ఉపాధ్యక్షురాలు నల్ల రజితతో పాటు కొడకండ్ల కొమురయ్య, వేల్పుల ప్రశాంత్, మెరుగు భిక్షపతి, పోషక సమ్మక్క, కొమురక్క, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గోపాలపురంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని గోపాలపురంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రావుల వెంకట రమేష్ గౌడ్ అధికారులను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, రద్దీగా ఉండే ప్రాంతాల్లో రోడ్లపైనే వ్యాపారులు కూరగాయలు విక్రయించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక దృష్టి సారించి, గోపాలపురంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల దేవన్నపేట, కొమటిపల్లి, ఉనికిచెర్ల, హసన్‌పర్తి, జయగిరి గ్రామాల రైతులకూ అనుకూలంగా ఉంటుందని రమేష్ గౌడ్ అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## సద్దుల బతుకమ్మకు చెరువు శుభ్రం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా వరంగల్‌లోని 19వ డివిజన్‌లో ఉన్న ఎస్సార్ నగర్ చెరువును శుభ్రం చేశారు. స్థానిక కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, బతుకమ్మ ఉత్సవ సమితి అధ్యక్షుడు పల్లకొండ హరికుమార్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) సిబ్బంది చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో కందికొండ కిరణ్, ఠాకూర్ రాకేష్ సింగ్, కొత్తపెల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ డివిజన్ సాధనకు నిరాహార దీక్ష

◆ పోస్టర్‌ను ఆవిష్కరించిన జాడి రామరాజు



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం:** రెవెన్యూ డివిజన్ సాధన కోసం 48 గంటల నిరాహార దీక్ష పోస్టర్‌ను ఏటూరునాగారంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి అధ్యక్షుడు డా. జాడి రామరాజు నేత విడుదల చేశారు. బుధవారం మంగపేట మండల కేంద్రంలోని మల్లూరు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం దగ్గర బీజేపీ మండల అధ్యక్షులు రావుల జానకిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామరాజు నేత మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి రెవెన్యూ డివిజన్ ఆమోదం లభిస్తే 40 ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు లభించే అవకాశం ఉంటుందని అన్నారు. దీనివల్ల భూమి సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు. ఏటూరునాగారం, మంగపేట, తడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల్లోని రైతులకు, సాధారణ ప్రజలకు ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండడం వల్ల పంట నష్టాలకు వెంటనే నష్టపరిహారం చెల్లించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు, తాగునీరు లభించడం వల్ల లక్షల ఎకరాల బీడు భూములకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఈ నిరాహార దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని ఏజెన్సీ ప్రాంత నాయకులు, మేధావులు, పత్రికా మిత్రులు, ప్రజా సంఘాల నాయకులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామిడి సురేష్ పటేల్, మాజీ మండల అధ్యక్షులు ఎర్రం గాని వీరన్ కుమార్, పోడెం రవీందర్, రామాగాణి నరేందర్, కాసార్ల మల్లారెడ్డి, బొల్లికొండ సాంబయ్య, బడే జగన్, నిదిదవల శ్రీనివాస్, కొట్టుగోసు ప్రసాద్, గుండారపు రోహిత్ కుమార్, గూడా యాదగిరి, తొలిం శంకర్, కొమురం కన్నయ్య, కుమ్మరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ వ్యాపారస్తుల పరపతి సంఘం తమ సభ్యుడైన జారతి అశోక్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసింది. ఈ మధ్య అకాల మరణం చెందిన అశోక్ కుటుంబానికి సంఘం అండగా నిలిచింది. సంఘం అధ్యక్షుడు బేతి అశోక్ బాబు ఆధ్వర్యంలో, కార్యవర్గ సభ్యులు కలిసి బుధవారం జారతి అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారు అశోక్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం, వారి కుటుంబానికి సంఘం తరపున ఒక లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ ఆర్థిక సాయాన్ని అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కాసర్ల రాజు, మల్లూరు బాబురావు, బేతి రాజు, గుర్రాల మోహన్, పొక్కుల రజనీకాంత్, వీరన్న, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఏఎంవీఐ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖలో నూతనంగా ఎన్నికైన 102 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లలో (ఏఎంవీఐ) ఒకరైన యరబోలు వినోద్ రెడ్డి, ములుగు జిల్లాలో తన విధులను సోమవారం ప్రారంభించారు. ఆరు నెలల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం ఆయన జిల్లాకు కేటాయించబడ్డారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా రవాణా శాఖ అధికారి బారాగాడి శ్రీనివాస్, తమ కార్యాలయంలో విధుల్లో చేరిన వినోద్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. రవాణా శాఖలో ఆయన సేవలు జిల్లాకు ఎంతగానో ఉపయోగపడతాయని శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్వేతార్కలో దేవీ నవరాత్రి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, కాజీపేట:** కాజీపేటలోని స్వయంభూ శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉత్సవాల మూడవ రోజు అమ్మవారు చంద్రఘంటా రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రాతఃకాల వేళల్లో ఆలయంలోని ఉత్సవమూర్తికి అభిషేక కార్యక్రమం నిర్వహించి, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణాదేవికి శేష పూజలు నిర్వహించారు. ఆలయ బ్రహ్మశ్రీ అయినవోలు సాయి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో దేవతామూర్తులకు అష్టోత్తరాలు, అమ్మవారి పారాయణాలు నిర్వహించారు. ఆలయ కార్యకర్తలు కుమరాని శీనమ్మ, విజయకోటి, కవిత, పాక పవన్ కుమార్, వెంకట సాయి తేజ, సాత్వికతో పాటు అర్చకులు మనోజ్ త్రిపాఠి, శివం, దువేది రాకేష్, శుక్లా రోహిత్, ఉపాధ్యాయ హరికృష్ణ స్వామి పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆర్డీఎఫ్ విద్యార్థిని



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పేదరికం ఆమె లక్ష్యానికి అడ్డు కాలేదు. అమ్మానాన్నల త్యాగం, ఆమె పట్టుదల సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటును తెచ్చిపెట్టింది. పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్-వనితా అచ్చుతా పాయి జూనియర్ కళాశాల విద్యార్థిని బండారి స్వాతి, తన అద్భుతమైన ప్రతిభతో ఈ ఘనత సాధించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన స్వాతి తండ్రి వ్యవసాయం, తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించారు. కూతురి చదువు కోసం తమకున్న ఎకరం భూమిలో అర ఎకరం అమ్మి, ఆమె భవిష్యత్తుకు పునాది వేశారు. ఆర్డీఎఫ్ పాఠశాలలో పదవ తరగతిలో 10/10 జీపీఏ సాధించిన స్వాతి, ఆ తరువాత ఆర్డీఎఫ్-వనితా అచ్చుతా పాయి జూనియర్ కళాశాలలో బైపీసీ పూర్తి చేసి 974/1000 మార్కులు సాధించింది. తొలి ప్రయత్నంలోనే ఈఎంసెట్‌లో 12,080 ర్యాంకు, నీట్‌లో అర్హత సాధించినా, ఆమె మరింత మెరుగైన ర్యాంకు కోసం పట్టుదలతో కృషి చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు అకాడమీలో లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని 2023-24లో ఈఎంసెట్ 1,300, నీట్‌లో 5,200 ర్యాంకులు సాధించింది. తనపై తనకున్న నమ్మకంతో 2024-25లో స్వయంగా చదువుకుని ఈఎంసెట్‌లో 404, నీట్‌లో 926 ర్యాంకు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. స్వాతి విజయం గురించి తెలిసిన వెంటనే, కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ. జనార్దన్ మాట్లాడుతూ "స్వాతి ఎంబీబీఎస్ సీటు సాధించడం మా కళాశాలకే గర్వకారణం. గ్రామీణ విద్యార్థులకు ఉన్న ప్రతిభకు ఇది గొప్ప నిదర్శనం," అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాజుతో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నపూర్ణా దేవి అవతారంలో దుర్గామాత

- జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ప్రత్యేక పూజలు
- రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో మహన్నదానం



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలోని రామాలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. దుర్గామాత ఉత్సవ కమిటీ ఛైర్మన్ చింతలపూడి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత బుధవారం అన్నపూర్ణా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహన్నదాన కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ అన్నపూర్ణా దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని పూజించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ములుగు జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌తో పాటు ఇతర రైస్ మిల్లర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదరి రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకట్ కందికట్ల



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకట్ కందికట్ల నియమితులయ్యారు. ఈ విషయాన్ని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య తెలిపారు. వరంగల్ నగరంలోని శివనగర్ సాయి కన్వెన్షన్ హాలులో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా మహాసభల్లో నూతన కమిటీని నియమించారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా బసవ పున్నయ్య, అతిథులుగా రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాజశేఖర్, దయాసాగర్, రఘు హాజరయ్యారు. మహాసభల సందర్భంగా నూతన కమిటీలో వెంకట్ కందికట్లను ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకట్ కందికట్ల మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం, వారి సమస్యలను ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

# గాయత్రీ దేవి అవతారంలో అమ్మవారు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ప్రసిద్ధ కనకదుర్గమ్మ, మదన పోచమ్మ ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల మూడవ రోజు బుధవారం అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితుడు మణిదీప్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మార్క శశికళ – సత్యనారాయణ గౌడ్ (శారద స్కూల్) దంపతులు దాతలుగా వ్యవహరించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ, పరకాల సబ్ ఇన్‌స్పెక్టర్ విఠల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెసరు విజయ్ చందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కొండేటి శ్రీధర్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివ ప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి, నిఖిల్, సాయి, రాకేష్, రాజేంద్రప్రసాద్, సత్యం, చరణ్, శివ, రజనీకాంత్, అశోక్, మనోహర్ తో పాటు భక్తులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు ఉద్యోగులకు పండుగ అడ్వాన్స్ ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, ఆసిఫాబాద్ :** పండుగ అడ్వాన్స్ ఇవ్వాలని, అలాగే పాత జీవో ప్రకారం పీఆర్సీ కలిపి జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు చిరంజీవి ఆధ్వర్యంలో డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఎండీ. షఫీయుద్దీన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ లక్షల రూపాయల జీతం పొందే శాశ్వత కార్మికులకు రూ. 25 వేల దసరా అడ్వాన్స్ ఇస్తున్నప్పుడు, తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీసం రూ. 20 వేల అడ్వాన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాశ్వత ఉద్యోగులకు అడ్వాన్స్ ఇవ్వడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, వారికి రూ. 50 వేలు చెల్లించాలని కూడా కోరుతున్నామని చెప్పారు. ప్రతి సంవత్సరం శాశ్వత ఉద్యోగులతో కలిసి ఎన్‌హెచ్ఎం అభివృద్ధికి కృషి చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విస్మరించడం తగదని ఆయన పేర్కొన్నారు. తమకు కూడా పండుగలు ఉంటాయని ప్రభుత్వం గుర్తించాలని, రూ. 20 వేల దసరా అడ్వాన్స్ చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ఎన్‌హెచ్ఎం స్కీమ్‌లో పనిచేస్తున్న డయాస్, రేడియాగ్రాఫర్స్ కు కూడా కొత్త జీవో కాకుండా పాత జీవో ప్రకారం పీఆర్సీ కలిపి జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ కోశాధికారి సీహెచ్ నాగేష్, డీపీఎం యూనిట్ డిస్ట్రిక్ట్ అకౌంట్ ఆఫీసర్ ప్రవీణ్, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ సైకాలజిస్ట్ లీద్య, షకీల్, జీవిత తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం జరిమానాలు విధించారు. ఈ మేరకు వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.సుజాత వెల్లడించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడిన ఒక వ్యక్తికి మెజిస్ట్రేట్ రూ. 500 జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 15 మంది వాహనదారులకు రూ. 14,100 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి, సురక్షితమైన ప్రయాణానికి సహకరించాలని కోరారు.

# పదవీ విరమణ చేసిన హోంగార్డ్‌ను సత్కరించిన సీపీ



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సుదీర్ఘకాలం హోంగార్డుగా సేవలందించిన రవికుమార్ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవికుమార్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్తులో ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని కమిషనర్ రవికుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నాగయ్య, ఆర్ఐలు చంద్రశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** ఇటీవల మరణించిన రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కడారి ఆంజనేయులు దశదిన కర్మ సందర్భంగా, ఆయన స్నేహితులు వారి కుటుంబానికి అండగా నిలిచారు. ఆంజనేయులు 10వ తరగతి మిత్రులు కలిసి రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం వారి స్నేహానికి, మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై. కుమార్ గౌడ్, ద్యావరా భిక్షపతి, తొలుపులూరి సతీష్, తుడి కుమార్, కల్పగురి హరినాథ్, నూనెముంతల మురళి, మినుముల యాదవరెడ్డి, గోనే సుధాకర్, సింగరపు నర్సింగ్ రావు, కరిమికొండ శ్రీనివాస్, కడారి లక్ష్మీ నారాయణ, ఆరూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసిన భవానీ స్వాములు



**వరంగల్ వాయిస్, రేగొండ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ను రేగొండ మండలానికి చెందిన భవాని మాల ధారణ స్వాములు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఈ సమావేశం జరిగింది. బండి సంజయ్ ప్రతి సంవత్సరం కరీంనగర్ పట్టణంలోని మహాశక్తిపీఠం ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన రేగొండ మండలానికి చెందిన 13 మంది భవాని స్వాములు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిదర్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం వారు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పున్నం రవి, మైస భిక్షపతి, గండి తిరుపతి గౌడ్, సామల తిరుపతి రెడ్డి, ఎల్దండి నరేష్, సామల సురేందర్ రెడ్డి, కందుకూరి కృష్ణ, దేవాకారి ప్రతాప్, శివకృష్ణ, నరసింగరావు, గంధం శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ వాసుల కన్నీటి వరద

## ◆ 40 ఏళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులు



**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామం ఎనిమిదో వార్డు కాలనీలో సరైన రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ కాలనీకి రోడ్డు నిర్మించాలని కోరుతూ బుధవారం కాలనీ ప్రజలు రోడ్డుపై మొక్కలు నాటి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బుస తిరుపతి మాట్లాడుతూ, మామిళ్ల రవి ఇంటి నుండి వేముల తిరుపతి, కొంగంటి కొమరమ్మ ఇంటి వరకు రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత 40 ఏళ్లుగా గ్రామానికి ఎంతమంది సర్పంచులు, వార్డు మెంబర్లు వచ్చినా తమ కాలనీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని,



ఏ రాజకీయ పార్టీ తమను పట్టించుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో మట్టి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి గుంతలు ఏర్పడుతున్నాయని, దీంతో రాకపోకలు కష్టమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరగడం వల్ల పాములు, తేళ్ల భయంతో భయాందోళన చెందుతున్నామని తెలిపారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు.

### స్పందించకుంటే నిరసనలు..

ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, రోడ్డు నిర్మాణం చేపట్టాలని బుస తిరుపతి డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాలనీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసనలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం



**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరివారి ప్రీతంకు రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు బుధవారం ఘన స్వాగతం పలికాయి. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మేకల రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేష్ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ప్రీతంకు, కాంగ్రెస్ నాయకులు పూలగుచ్చాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఇందిరమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొడవటంచ ఆలయ డైరెక్టర్ కోలపాక సాంబయ్య, రాష్ట్ర నాయకులు దబ్బేట రమేష్, ఓరం సమ్మయ్య, మడికొండ శ్రీను, మొగుళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, మండల యువజన సంఘం అధ్యక్షుడు కోయిల క్రాంతి, నాయకులు దాట్ల రమేష్, బొచ్చు రవి, బొల్లారపు భద్రయ్య, గడ్డం కొమురయ్య, మేకల శివ, పరుసందుల రమేష్, బోట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుకు హాజరైన ఉద్యమకారులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమం సమయంలో నమోదైన కేసులో భాగంగా కొంతమంది ఉద్యమకారులు బుధవారం హనుమకొండ జిల్లా మూడవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరయ్యారు. 2014 జూన్ 1న కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో సుబేదారి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఏ1 జోరిక రమేష్, ఏ2 బోడ డిన్న, ఏ3 చాగంటి రమేష్ జడ్జి ముందు హాజరయ్యారు. కేసు తదుపరి విచారణను 2025 నవంబర్ 4కు వాయిదా వేశారు. ఉద్యమకారుల తరపున న్యాయవాదులు గుర్రాల వినోద్, మోలుగురి రంజిత్, వసంత్ కుమార్, శ్రీరామ్ కిరణ్, నాయిని రవి, జాషువా తదితరులు వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు జోరిక రమేష్ మాట్లాడుతూ ఉద్యమ కేసులను ఎత్తివేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఉద్యమకారులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై ఉన్న ఉద్యమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన కోరారు.

# ఎన్ఎస్ఎస్ తో సామాజిక స్పృహ




**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా విద్యార్థులలో జ్ఞానంతో పాటు శ్రమ, సమాజం పట్ల ప్రేమను పెంపొందించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మంజుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ యువతలో సామాజిక స్పృహను పెంచడానికి ఎన్ఎస్ఎస్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. సామాజిక రుగ్మతలకు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన పెంచడానికి కృషి చేయాలని ఆయన ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అజం, బాబూరావు, రాములు, సదానందం, వెంకట్, గణేష్, రాజేందర్, రవళి, వేణుగోపాలకృష్ణలతో పాటు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# రామాలయానికి విరాళం

**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రఖ్యాతి గాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయానికి గణపురం గ్రామస్థులు భారీ విరాళం అందించారు. కీర్తిశేషులు కటంగూరి నరేందర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె మల్లాడి సరిత శ్రవణ్ కుమార్ రెడ్డి రూ.1,00,000 విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మునునూరి నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, విరాళం అందించిన దాతలకు ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, భటిక స్వామి, బూర రాజగోపాల్ గౌడ్, మాదాసు మొగిలి గౌడ్, మాదాసు అర్జున్ గౌడ్, ఉయ్యాల భిక్షపతి గౌడ్, మోటపోతుల రాజన్న గౌడ్, దయ్యాల భద్రయ్య, పాండవుల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'వరుడు షాపింగ్ మాల్' ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'వరుడు షాపింగ్ మాల్'ను స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమా రెడ్డి బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సమీపంలో ఉన్న ఈ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన సందర్భంగా నీలిమా రెడ్డి నిర్వాహకుడు బోగ కైలాసంను అభినందించారు. అంతకుముందు, షాప్ నిర్వాహకులు నీలిమా రెడ్డికి పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు. డివిజన్ నాయకులు, కార్యకర్తలు, షాపింగ్ మాల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# వృద్ధురాలికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మన సనాతన హిందూ సేవా సమితి బుధవారం తమ 114వ సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శాయంపేటకు చెందిన వృద్ధురాలు కొంతం బాలమణికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలను అందించారు. బాలమణి ఎటువంటి ఆధారం లేకుండా, అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమితి సభ్యులు ఆమెకు అండగా నిలిచారు. సమితి వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నరేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, సలహాదారు ప్రతాపగిరి గణేష్, గ్రూప్ సభ్యులు నోముల మహేష్ బాబు, గంగిడి ధర్మారెడ్డి, దిడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# 25న ప్రపంచ ఫార్మసిస్ట్స్ దినోత్సవం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్ట్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం నల్లకుంటలోని ఫీవర్ హాస్పిటల్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్థిక, ప్రణాళిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గౌడ్ గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. ఈ వేడుకలకు ఆరోగ్య శాఖ కార్యదర్శి, హెల్త్ కమిషనర్, టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, టీవీవీపీ కమిషనర్, ఫీవర్ హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శులు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, తెలంగాణ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ ప్రెసిడెంట్ తదితరులు అతిథులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరపున జాలిగామ అశోక్, రాష్ట్రంలో డీహెచ్, డీఎంఈ, టీవీవీపీల కింద పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆర్‌బీఎస్కే, 104, యూపీహెచ్‌సీ, ఎన్‌హెచ్ఎం, 300 ఓసీఎస్ మరియు వివిధ ఏజెన్సీలలో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లందరూ పెద్ద ఎత్తున హాజరై ఈ పండుగను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఉజ్జయినిలో ఉదయం మిత్రమండలి ప్రత్యేక సమావేశం



**వరంగల్ వాయిస్, మధ్యప్రదేశ్:** ఉదయం తెలుగు దినపత్రిక మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ ఐదవ ప్రత్యేక సమావేశం మధ్యప్రదేశ్‌లోని ప్రసిద్ధ శైవక్షేత్రం ఉజ్జయినిలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ త్వరలో ఉదయం మిత్రమండలి సభ్యులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఉదయం దినపత్రికలో పనిచేసినప్పుడు ఎదురైన అనుభవాలతో ఒక సావనీర్ (స్మారక సంచిక) తీసుకురావాలని తీర్మానించారు.వివిధ రంగాలలో పనిచేస్తూ రాష్ట్రస్థాయి అవార్డులు పొందిన పూర్వ పాత్రికేయులు కన్నా పరశురాములు, వెంకటేశ్వర రావులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఉజ్జయిని, ఓంకారేశ్వర జ్యోతిర్లింగాల సందర్శనతో పాటు ఐదవ ప్రత్యేక సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేసిన పూర్వ సిబ్బంది సర్దార్ ఓంకార్ సింగ్, సంసార్ సింగ్ దంపతులను కూడా సత్కరించారు. కోశాధికారి అమృత రఘునాథ్, సహాయ కార్యదర్శి ముల్లంగి మోహన్ రెడ్డి, ఈసీ సభ్యుడు అవారి వెంకటేశ్వర శర్మ, సభ్యులు రామ్మూర్తి, రవీందర్ రావు, శ్రీధర్, సదానందం, లక్ష్మణ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి నుంచి అమెరికా వరకు ఓజీ సందడి

- నేడు విడుదలవుతున్న పవన్ ఓజీ
- మిరాయ్ థియేటర్ల ఓజీ సందడి

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన చిత్రం 'ఓజీ' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పవన్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తోన్న ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం కోసం 'మిరాయ్' నిర్మాత విశ్వప్రసాద్ ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 12న తేజ సజ్జా నటించిన 'మిరాయ్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ చిత్రం ప్రదర్శితమవుతోన్న థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత విశ్వప్రసాద్ పవన్‌కల్యాణ్ కోసం గొప్ప నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 25న 'మిరాయ్' థియేటర్స్ కొన్నింటిలో 'ఓజీ'ని ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చారు. మళ్లీ సెప్టెంబర్ 26 నుంచి యధాతథంగా ఆ థియేటర్స్‌లో 'మిరాయ్'ను ప్రదర్శించనున్నారు. దీంతో విశ్వప్రసాద్ నిర్ణయంపై పవన్ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నార్త్ అమెరికాలో ఓజీ సినిమా డిజిటల్ ప్రింట్‌లు ఇంకా అందలేదని, కొన్ని కారణాల వల్ల కెనడాలో ఓజీ సినిమాను ప్రదర్శించడం లేదని ఇటీవల నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు వీటికి లైన్ క్లియరైంది. ప్రింట్‌లు అందినట్లు– డిస్ట్రిబ్యూటర్లు ఎక్స్ వేదికగా తెలిపారు.

## పవన్ అభిమానుల సందడే సందడి

ఐమాక్స్ వద్ద భారీ కటౌట్‌తో హంగామా హైదరాబాద్ ప్రసాద్ ఐమాక్స్ వద్ద పవన్ కల్యాణ్ అభిమానులు సందడి చేశారు. పవన్ నటించిన ఓజీ గురువారం విడుదల కానున్న సందర్భంగా అభిమానులు ఐమాక్స్ వద్ద భారీ కటౌట్‌ను ఏర్పాటు– చేసి బాణాసంచా వెలుగుల్లో దాన్ని ఆవిష్కరించారు. అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ప్రసాద్ ఐమాక్స్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది. మరోవైపు బుధవారం రాత్రి 10 గంటల నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఓజీ ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ యాక్షన్ మూవీ ఓజి సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ప్రీమియర్ షోస్ టికెట్స్ కు ఎక్కడాలేని డిమాండ్ ఉంది. మరి ముఖ్యంగా నైజాంలో ఒక్కో టికెట్ రూ. 1200 నుండి రూ. 2000 వరకు పలుకుతోందట. పవర్ స్టార్ కొడుకు అకిరా నందన్ క్షఏ సినిమాను ఎక్కడ చూడబోతు న్నాడు అనే క్యూరియాసిటీ– అందరిలోనూ నెలకొంది. అకిరా హైదరాబాద్ బాలానగర్ లో ఉన్న మైత్రి విమల్ థియేటర్ లో చూడబోతున్నాడు. అకిరాతో పాటు– దర్శక దిగ్గజం రాజమౌళి, కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కూడా ఈ ప్రీమియర్ కు రాబోతున్నాట్టు– తెలుస్తోంది. అకిరా వస్తుండడంతో ఈ ప్రీమియర్ ను భారీ స్థాయిలో సెలెబ్రేట్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు పవర్ స్టార్ అభిమానులు. మరోవైపు అనకాపల్లి నుండి అమెరికా వరకు ఓజి సెలెబ్రేషన్స్ ను కనివిని ఎరుగని రీతిలో చేస్తున్నారు ఫ్యాన్స్. వింటేజ్ పవన్ కళ్యాణ్ ను మరోసారి సిల్వర్ స్క్రీన్ పై చూడబోతున్నామని ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నారు.

## ఓజీ కథపై పలు రకాల చర్చలు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మోస్ట్ అవైటెడ్ సినిమా ఓజి ..యంగ్ దర్శకుడు సుజిత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. తమిళ భామ ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హష్మీ విలన్ గా నటించాడు. టాలీవుడ్ సెన్సేషన్ తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను డివివి ఎంట్టంల్గ□న్మెంట్స్ బ్యానర్ పై దానయ్య నిర్మించారు. ఈ సినిమా పూర్తి అవుట్ అండ్ అవుట్ యాక్షన్ సినిమాగా వస్తోంది. ఇక కథ విషయానికి వస్తే ఒకప్పుడు ముంబై మాఫియాను ఏలిన గ్యాంగ్ స్టర్ ఓజి . ముంబై మొత్తాన్ని తన కనుసైగలతో శాసిస్తాడు. కానీ ఒక బలమైన కారణంగా ఉన్నట్టుండి మాఫీయాను వదిలేసి ఎక్కడో దూరంగా బ్రతుకుతుంతాడట. ఓజి వెళ్ళిపోవండం ఇమ్రాన్ హష్మీ మాఫియను తన గుప్పిట్లో పెట్టుకోవాలని, ఆధిపత్యం చెలాయించాలని చూస్తడట. ఈ క్రమంలో ఓజి ఫ్యామిలీ జోలికి వేల్తాడట. దాంతో అజ్ఞాతం వీడి ఈసారి తన కొడుకుని, ఫామిలీని రక్షించుకోవడం కోసం ముంబై తిరిగివచ్చిన ఓజి చేసే విధ్వంసం మాములుగా ఉండదట. ముంబై తిరిగి వచ్చిన ఓజీకి అలాగే ఓమికిమధ్య జరిగే సంఘర్షణ నెక్స్ట్ లెవల్ లో ఉండబోతుందట. కాస్త అటు– ఇటుగా ఈ సినిమా అజిత్ కుమార్ గుడ్ బ్యాడ్ అగ్లీ ని పోలిఉంటుందని టాలీవుడ్ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్ గురించి మాత్రం ఓ రేంజ్ లో చెప్పుకుంటున్నారు.




# సాయిపల్లవికి కలైమామణి పురస్కారం

తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కలైమామణి పురస్కారాలను బుధవారం ప్రకటించింది. సాయి పల్లవి, ఏస్‌జే సూర్యలతో పాటు– మరో 90 మందికి ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటించింది. కళారంగంలో ప్రతిభ కనబరుస్తోన్న వారికి ప్రతి ఏడాది ఈ పురస్కారాలను అందిస్తారు. 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను ఏడాదికి 30 మందికి చొప్పున బుధవారం 90 మంది కళాకారులకు ప్రభుత్వం కలైమామణి అవార్డులు ప్రకటించింది. 2021 సంవత్సరానికి గాను నటి సాయిపల్లవి, నటుడు, దర్శకుడు ఎస్.జె.సూర్య సహా ఐదుగురు అవార్డును సొంతం చేసుకున్నారు. 2023కు సంగీత దర్శకుడు అనిరుధ్‌తో పాటు– మరో ఆరుగురు కలైమామణి పురస్కారాన్ని అందుకోనున్నారు. జాతీయ పురస్కారాల విభాగంలో ప్రముఖ నేపథ్య గాయకుడు కె.జె.ఏసుదాస్‌కు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పురస్కారాన్ని ప్రకటించారు. అక్టోబరులో ఈ పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది.



# నాగ్ వందో సినిమాపై సర్వత్రా చర్చ


□ తమిళ డైరెక్టర్ రా కార్తీక్ దర్శకత్వంలో అంటూ చక్కర్లు



ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగ్ ఇటీ–వలే కూలీ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన విషయం తెలిసిందే. ఇక నాగార్జున కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై కొత్త అప్‌డేట్ ఎప్పుడెప్పుడొస్తుందా..? అని మూవీ లవర్స్‌తోపాటు– అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారి కోసం నాగ్ వందో సినిమాకు సంబంధించిన క్రేజీ వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు కార్తీక్ డైరెక్ట్ చేయబోతున్నాడట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ఫిక్స్ అయినట్టు– సమాచారం. రాబోయే రోజుల్లో నాగ్ 100 సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలపై స్పష్టత రానుంది. యూనిక్ స్టోరీ –టె–ల్లింగ్, థ్రిల్లింగ్ కథనాలతో తనదైన మార్క్ చూపించే రా కార్తీక్ నాగార్జున కెరీర్ మైల్‌స్టోన్ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇంతకీ రా కార్తీక్ నాగ్ కోసం ఎలాంటి కథను సిద్ధం చేశాడు. కూలీలో తొలిసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించిన నాగార్జున మరి రా కార్తీక్‌తో ఎలాంటి కథ చేయబోతున్నాడన్నది అందరిలో ఉత్కంఠ నెలకొంది.

# శ్రమ వృథా అయ్యిందంటూ ఆవేదన

□ సైయారా మోజులో కొట్టుకుపోయిన తన్వి ది గ్రేట్




ఇటీవల విడుదలై యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న చిత్రం 'సైయారా' . చిన్న సినిమాగా వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే ఈ విజయం పై ప్రముఖ నటుడు, దర్శకుడు అనుపమ్ ఖేర్ కొంత అసమనంగా ఉన్నారు. కారణం తాను దర్శకత్వం వహించిన 'తన్వి ది గ్రేట్' కూడా అదే రోజు విడుదలైంది, కానీ 'సైయారా' హిట్ కావడంతో..తన సినిమా ఎవరు గుర్తించలేదు..దీంతో 'తన్వి ది గ్రేట్' కోసం నాలుగేళ్లు కష్టపడ్డాను. ఒక సంవత్సరం స్క్రిప్ట్ రాయడానికి, ఇంకో సంవత్సరం సంగీతానికి సమయం కేటాయించాను. కానీ 'సైయారా' తో పాటు– మా సినిమా విడుదల కావడం దురదృష్టం 'తన్వి ది గ్రేట్' డిజాస్టర్‌గా మిగిలిపోయింది. నా వెంట ఉన్న 200 మందికి పైగా టీమ్ సభ్యుల కష్టం వృథా అయిందని అనుపమ్ చెప్పారు. అదే సందర్భంలో ఆయన సినిమా ఎదుర్కొన్న ఇబ్బందులు గురించి కూడా ప్రస్తావించారు.. విడుదలకు ముందే ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నాం. భారీ బడ్జెట్ కావడంతో ఖర్చుల కోసం స్నేహితుల సహాయం తీసుకున్నా. ఈ చిత్రాన్ని కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శించాం, రాష్ట్రపతికి కూడా చూపించాం. అందరూ ప్రశంసించారు కానీ, ప్రేక్షకులు మాత్రం గుర్తించలేదు.. ఒకటి మాత్రం అర్థం అయింది. ప్రపంచం ఒక ప్రేమకథను చూడాలనుకుంది. అందుకే 'సైయారా' విజయాన్ని సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలో పరిస్థితులు ఇలాగే ఉంటాయి. రెండు సినిమాలు ఒకేసారి విడుదలైతే, విజయం సాధించిన చిత్రం కోసం.. ఇంకో సినిమా 400 థియేటర్లలో రిలీజ్ అయిన కూడా పట్టించుకోరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# గాయత్రీ మాతగా భద్రకాళి

- మూడో రోజుకు చేరిన శరన్నవరాత్రోత్సవాలు
- భారీగా తరలి వస్తున్న భక్తులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రులు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం అనంతరం అమ్మవారిని గాయత్రిమాతగా అలంకరించారు. అయితే గాయత్రి అమ్మవారి దర్శనంతో మంత్ర సిద్ధి కలుగుతుందని, మనం చేసే జపం, మనం చదివే చదువు ఒంటబట్టి ఉత్తీర్ణులవడానికి ఉపకరిస్తుందని అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఉదయం చంద్రఘంటా క్రమంలో సింహవాహన సేవ, సాయంకాలం మహిషమర్ధిని దుర్గా క్రమంలో గజవాహన సేవలో పూజారాధనలు జరిపించారు. చంద్ర ఘంటా క్రమంలోని అమ్మవారిని సేవించడం ద్వారా సాధకుడిని పట్టిపీడిస్తున్న అసుర శక్తులు దూరమైపోతాయి. మహిషమర్ధిని క్రమంలో అమ్మవారిని ఆరాదిస్తే దుర్మదములను అణచివేసి జాడ్యాన్ని తొలగించి సాధన సక్రమంగా కొనసాగేలా చేస్తుందన్నారు. అమ్మవారి విశేష అలంకరణకు ఉభయ దాతలుగా దుగ్యాల మనోహర్ రావు–పద్మ దంపతులు, నిహారిక, అభిషేక రావు తదితరులు వ్యవహరించారు. దేవాలయ చైర్మన్, ధర్మకర్తలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవాలయమును సందర్శించిన భక్తులందరికీ శ్రీ భద్రకాళి సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అశేష అన్నదానం నిర్వహించారు. అమ్మవారిని కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి తదితరులు దర్శించుకున్నారు. సాయంకాలం నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలైన హరికథ, భక్తి సంగీతం, కర్నాటక సంగీతం, కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి, సహాయ కమిషనర్ రామల సునీత తెలిపారు.



## శారద అమ్మవారిగా దర్శనం..

నగరంలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో శ్రీ శృంగేరి శారద పీఠాధిపతులు, ఉభయ జగద్గురువులు శ్రీ భారతి తీర్థ మహాస్వామి, శ్రీ విధుశేఖర భారతీ స్వామి అనుగ్రహ ఆశీస్సులతో జరుగుతున్న శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజు బుధవారం రేణిగుంట్ల కుమారస్వామి–అన్నపూర్ణ దంపతులు ఆయుష్య హోమం నిర్వహించారు. శంకరమఠం ప్రధానార్చకులు సంగమేశ్వర జోషి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర శర్మ , బలరాం మిశ్రా, సోమశేఖర శర్మ గోపూజ, సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం విశేష అలంకరణతో శ్రీ శారద అమ్మవారికి విశేష పూజలు చేశారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణం, మహా మంగళ హారతులు అనంతరం శ్రీ శారదా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వరంగల్ నగరంలోని వివిధ ప్రాంతాల చెందిన సుమారు 1,500 మంది భక్తులు శ్రీ శారదా అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం జగన్మోహన్ శర్మ–రాజేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో సుహాసినిలు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి గజ్జెల రంజిత్ కుమార్ బృందం ప్రదర్శించిన పేరిణి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో శ్రీ శంకర సేవా సమితి సభ్యులు, భక్తులకు సేవలు అందించారు.



## అన్నపూర్ణ దేవిగా..

**వరంగల్ వాయిస్, జనగామ :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జనగామ పట్టణంలోని బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం నాలుగో రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పూజారి మారుపాక శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు లగిశెట్టి పద్మావతి, దూడల శోభారాణి, మాదారపు కల్పన, మోటె రేణుక, ఆలేటి పద్మ, సంబోజు జ్యోతి, బండోజు సరళ, ఎనగందుల రేణుక తదితరులు పాల్గొన్నారు.



# సమష్ఠి కృషితోనే రాజ్యాధికారం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి
- కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీల సమష్ఠి కృషితోనే రాజ్యాధికారం సిద్ధిస్తుందని మాజీ కుడా చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకలె బీసీలు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా రాంనగర్ లోని బీసీ భవన్ లో ఓబీసీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 26 చాకలి ఐలమ్మ జయంతి, 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉన్నందున కుల సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీసీలంటే పార్టీ జెండాలు మోయడం కాదు. మనకంటూ ఒక ఎజెండాను తయారు చేసుకుని పక్కా ప్రణాళికతో ముందుకెళ్లి మన హక్కుల కోసం పోరాటం చేసి రాజ్యాధికారం దక్కించుకోవాలన్నారు. బీసీలలో రాజకీయ చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సమష్ఠిగా పోరాటం చేస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. మహిళలకు ఉమెన్ పైలెట్ ట్రైనింగ్ ద్వారా త్వరలో వారికి ఉపాధి కల్పించడంలో నా వంతు పాత్ర ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి బీసీలను మోసం చేయడానికి కొత్త ఎత్తుగడను ప్రయోగిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ టి.విజయలక్ష్మి, కొనగాని యాదగిరి గౌడ్, అశోక్ ముదిరాజ్, జాయింట్ సెక్రెటరీ బండారి వివేకానంద, వైద్యం రాజగోపాల్, వేణుమాధవ్ గౌడ్, తుపాకుల రవి, డాక్టర్ రాము, భిక్షపతి, క్రాంతి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాలను నియంత్రించాలి

**వరంగల్ వాయిస్, క్రైం :** డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మట్టేవాడలోని ఏసీపీ కార్యాలయాన్ని సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శుభం పుష్పాగుచ్చాలను అందజేసి సీపీకి స్వాగతం పలికారు. సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం కార్యాలయ పరిసరాలను పరిశీలించడంతో పాటు ఏసీపీ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో దర్యాప్తు చేపట్టిన కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలపై సీపీ అరా తీశారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమాతోపాటు ఏసీపీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# చిల్లర పనులు, చిలిపి చేష్టలు

- స్టేషన్ ఘనపూర్ ను భ్రష్టు పట్టించారు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** గత 15 ఏళ్లు అవినీతి, అక్రమాలు, చిల్లర పనులు, చిలిపి చేష్టలతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునాథపల్లి మండలానికి సంబందించిన 46మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ. 46,05,336 విలువగల చెక్కులను, 32మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.12.51లక్షల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం రఘునాథపల్లి మండలం కన్నాయిపల్లి గ్రామం నుంచి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలోపలువురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కడియం శ్రీహరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, తహసీల్దార్, ఎంపీడీవో, ఏవో, ఇతర అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com